

మట్టి గణపతి విగ్రహాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

I | హైదరాబాద్, గురువారం 22 ఆగస్టు 2024 | HYDERABAD





ఉప్పల్ నియోజకవర్గంలోని చిలుకానగర్‌లో రోడ్డుపై ఏర్పడిన భారీ గుంత

## మట్టి గణపతిని పూజించాలి


ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి

అమీర్‌పేట్, ఆగస్టు 21: మట్టిని దేవునిగా చేద్దాం.. భక్తిని పూజగా అర్పిద్దాం.. అంటూ ప్రజల్లో మట్టి వినాయక విగ్రహాల వినియోగంపై అవగాహన కల్పిస్తూ టీజీపీసీబీ రూపొందించిన గోడ పత్రికను బుధవారం సచివాలయంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి ఆవిష్కరించారు. గణేశుడి పూజలో వినియోగించే పూలు, మూలికలను కంపోస్ట్ చేయాలని, మట్టిలో కలవని పదార్థాలను స్వచ్ఛమైన నీటి వనరులలో ముంచవద్దని ఆమె ప్రజలకు సూచించారు. గ్రేటర్ పరిధిలో 8 ఇంచుల ఎత్తుతో ఉన్న 1.20 లక్షల మట్టి గణపతి విగ్రహాలు, 32 జిల్లాల్లో 1.20 లక్షల విగ్రహాలు కలిపి మొత్తం 2.40 లక్షల విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని టీజీపీసీబీ పర్యావరణ చైతన్య కార్యక్రమాలను రూపొందించిందని, వివిధ మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, టీజీపీసీబీ సభ్య కార్యదర్శి జి.రవి, చీఫ్ ఇంజినీర్ బి.రఘు పాల్గొన్నారు.



# 9 రోజులు.. 731 కేసులు

## డెంగీ ఫీవర్‌తో మూలుగుతున్న గ్రేటర్





సిటీబ్యూరో, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): డెంగీ జ్వరాలతో గ్రేటర్ మూలుగుతోంది. ఏ ఇంట్లో చూసినా జ్వర పీడితులే. జలుబు, దగ్గు, జ్వరం, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా డెంగీ వంటి విష జ్వరాల బాధితులతో ఫీవర్ హాస్పిటల్, గాంధీ, ఉస్మానియా, ప్రాథమిక స్థాయిలోని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా, జిల్లా దవాఖానలు కిక్కిరిసిపోతున్నాయి. నల్లకుంట ఫీవర్ హాస్పిటల్‌లోనే ప్రతి రోజూ పదుల సంఖ్యలో డెంగీ కేసులు నమోదవుతున్నట్లు అధికారులు తెలిపారు. ఇక పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, సీహెచ్‌సీ స్థాయి దవాఖానల్లో ప్రతి రోజూ కనీసం 5నుంచి 10 మధ్య, 10 నుంచి 20 వరకు డెంగీ లక్షణాలున్న అనుమానిత కేసులు వస్తున్నట్లు ఆయా దవాఖానల అధికారులు తెలిపారు.

### వేధిస్తున్న కిట్ల కొరత..

గ్రేటర్ పరిధిలోని పలు ప్రభుత్వ దవాఖానల్లో డెంగీ పరీక్షలు జరిపే కిట్లు లేక రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో కిట్ల కొరత కారణంగా ఓపీ రోగులకు డెంగీ పరీక్షలను బయటకు రెఫర్ చేస్తున్నట్లు రోగులు ఆరోపిస్తున్నారు. ఐపీ రోగులకు మాత్రమే డెంగీ పరీక్షలు చేస్తున్నారని, ఆ పరీక్షల రిపోర్ట్‌లను కూడా ఆలస్యంగా ఇవ్వడం వల్ల రోగి ఎక్కువ రోజులు దవాఖానలో ఉండాల్సి రావడమే కాకుండా చికిత్సలో జాప్యం జరుగుతున్నట్లు బాధితులు వాపోతున్నారు.

### జీహెచ్‌ఎంసీ నిర్లక్ష్యం వల్లే : వైద్యాధికారులు

నగరంలో అపరిశుభ్రత పెరిగింది. పారిశుద్ధ్యం గురించి పట్టించుకునే వారే కరువయ్యారు. జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రేటర్‌లో దోమల బెడద తీవ్రమైంది. ఇటీవల కురిసిన వానలతో దోమలు విజృంభిస్తున్నాయి. దోమల కారణంగా డెంగీ కేసులు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. గతంలో కూడా డెంగీ కేసులున్నప్పటికీ ఈ స్థాయిలో నమోదు కాలేదు. ఈ మధ్య డెంగీతో పాటు చికున్‌గున్యా, మలేరియా కేసులు కూడా నమోదవుతున్నాయి. జనావాసాల మధ్యనే కాకుండా హాస్పిటల్స్‌లో కూడా దోమలు తీవ్రంగా ఉన్నాయి. వైద్యులు రోగులకు చికిత్స మాత్రమే చేయగలుగుతారు. డెంగీ వంటి విషజ్వరాలు రాకుండా ఉండాలంటే జీహెచ్‌ఎంసీ అధికారులు పకడ్బందీగా పని చేయాలి. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి. పారిశుద్ధ్యం నిర్వహణ సక్రమంగా ఉండాలి. అనవసరంగా వైద్య శాఖను బ్లేమ్ చేయడం సరికాదు. వైద్యులు రోగాలు రాకుండా అడ్డుకోలేరు కదా.. రోగులకు సరైన చికిత్స అందించకపోతే అప్పుడు వైద్యశాఖను నిలదీయండి. డెంగీ కిట్ల కొరత అనేది ఉన్నతాధికారుల వైఫల్యం. మేము ఇండెంట్లు పెట్టినప్పుడు సరఫరా చేయాల్సిన బాధ్యత వారిపై ఉంటుంది. వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేసే కొందరు పరిపాలనా అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ సమస్యలు. వారి వల్ల కష్టపడే వారికి కూడా చెడ్డపేరు వస్తోంది. ప్రస్తుతం పెరుగుతున్న డెంగీ కేసులకు జీహెచ్‌ఎంసీ అధికారులదే పూర్తి బాధ్యత. దోమల నివారణలో వారు తీసుకుంటున్న చర్యలు పేర్లలో చూపించడం కాదు.. ప్రజల్లోకి వెళ్లి తెలుసుకుంటే బాగుంటుంది.



**ఆగస్టు 2024**

| తేదీ- కేసులు | తేదీ- కేసులు |
|---|---|
| 5- 142 | 10- 63 |
| 6- 108 | 11- 0 |
| 7- 96 | 12- 75 |
| 8- 68 | 13- 58 |
| 9- 70 | 14- 51 |

మొత్తం **731**

### నగరంలో డెంగీ జ్వరం..

గ్రేటర్‌లో డెంగీ జ్వరం దడ పుట్టిస్తోంది. కేవలం 9రోజుల వ్యవధిలోనే గ్రేటర్ వ్యాప్తంగా 731 డెంగీ కేసులు నమోదైనట్లు సాక్షాత్తూ జీహెచ్‌ఎంసీ రికార్డుల ద్వారా అవగతమవుతోంది. వారం రోజుల్లోనే 731 కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అధికారుల అంతర్గత గణాంకాల ప్రకారం ప్రతి రెండు ఇళ్లలో ఒక డెంగీ కేసు నమోదవుతుంది. అయితే రికార్డుల్లోకి వస్తున్నవి కేవలం ప్రభుత్వ దవాఖానల్లోని కేసులు మాత్రమే. ప్రైవేటు దవాఖానల్లో నమోదయ్యే డెంగీ కేసులను పట్టించుకునే తీరిక వైద్య, ఆరోగ్యశాఖ అధికారులకు లేదు. ప్రైవేటులో నమోదయ్యే కేసులను కలుపుకొంటే పై గణాంకాల ప్రకారం వారానికి సుమారు వెయ్యికి పైగానే డెంగీ కేసులు నమోదవుతున్నాయి. ఇవి కాకుండా ఇతర సీజనల్ కేసులు అదనం. ప్రతి ఇంట్లో ఇద్దరి కంటే ఎక్కువ మంది ఈ సీజనల్ జ్వరాలతో బాధపడుతున్నట్లు జీహెచ్‌ఎంసీ, ఆరోగ్యశాఖ గణాంకాల ద్వారా తెలుస్తోంది.

### రివ్యూలు మరిచిన అధికారులు..

సాధారణంగా వర్షాకాలానికి రెండు, మూడు నెలల ముందు నుంచే సీజనల్ వ్యాధుల నివారణకు సంబంధించి ప్రభుత్వం దృష్టిపెట్టాలి. ప్రధానంగా జిల్లా కలెక్టర్లు, వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, జీహెచ్‌ఎంసీ తదితర శాఖలకు చెందిన అధికారులతో రివ్యూ మీటింగ్‌లు జరపాలి. సీజనల్‌కు కారణమయ్యే దోమల నివారణకు జీహెచ్‌ఎంసీ తీసుకుంటున్న చర్యలపై దృష్టి పెట్టాలి. కలుషిత నీరు, ఆహార పదార్థాలకు సంబంధించి జలమండలితో పాటు ఇతర సంబంధిత అధికారులతో సమావేశాలు నిర్వహించాలి. నమోదవుతున్న కేసుల ఆధారంగా ఎప్పటికప్పుడు వైద్య, ఆరోగ్యశాఖతో పాటు సంబంధిత అన్ని శాఖలను అప్రమత్తం చేస్తూ తగిన సలహాలు, సూచనలివ్వాలి. ముఖ్యంగా వైద్య, ఆరోగ్యశాఖకు సంబంధించి సీజనల్ వ్యాధులపై సంబంధిత శాఖ మంత్రి స్థాయిలో రివ్యూ మీటింగ్‌లు ఏర్పాటు చేస్తూ పరిస్థితులను సమీక్షించాలి. కానీ, ప్రస్తుత ప్రభుత్వంలో ఇలాంటివేమి కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సీజనల్‌పై అటు అధికారులు గాని, ఇటు పాలకులుగాని మొక్కుబడి చర్యలకే పరిమితమవడంతో వైద్య, ఆరోగ్యశాఖ అనారోగ్య శాఖగా మారుతోంది.



## కేబీఆర్ పార్కు వద్ద స్మార్ట్ పార్కింగ్

మల్టీలెవల్ కారు పార్కింగ్ ఏర్పాటుకు టెండర్ల ప్రక్రియ పూర్తి

త్వరలో ఏజెన్సీకి పనులు అప్పగింత

కీలక కారిడార్‌లో తీరనున్న ట్రాఫిక్ సమస్య

సిటీబ్యూరో, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో అత్యంత రద్దీగా ఉండే కేబీఆర్ (కాసు బ్రహ్మానంద రెడ్డి పార్కు) వద్ద ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది. వీఐపీ కారిడార్‌లో వాహనదారుల తాకిడితో పాటు పార్కుకు వచ్చే వాకర్ల వాహనాలతో కేబీఆర్ పార్కు చుట్టూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం సమయాల్లో ఈ సమస్య జఠిలంగా ఉన్నది. దీంతో పార్కింగ్ సమస్యకు చెక్ పెడుతూ కీలక నిర్ణయం తీసుకున్నారు. కేబీఆర్ పార్కు గేట్-1 వద్ద కడక్ చాయ్ సమీపంలో స్మార్ట్ మల్టీలెవల్ (మెకనైజ్డ్) కార్, మోటారు సైకిల్ పార్కింగ్ సదుపాయం కల్పించేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు ఆసక్తి గల ఏజెన్సీల నుంచి దరఖాస్తుల స్వీకరణకు టెండర్లను ఆహ్వానించారు. డిజైన్, బిల్ట్, ఫైనాన్స్, ఆపరేషన్, ట్రాన్స్‌ఫర్ (డీబీఎఫ్‌ఓటీ) మోడ్‌లో పైలట్ ప్రాజెక్టుగా పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్ (పీపీపీ) విధానంలో ఏర్పాటు చేయనున్నారు. 405 చదరపు మీటర్లలో మల్టీలెవల్ కారు పార్కింగ్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. 72 కార్ల పార్కింగ్‌కు స్థలాన్ని కలిగి ఉంటుంది. ఉదయం 5 నుంచి రాత్రి 11 గంటల వరకు పనిచేసే విధంగా ఏర్పాటు చేయనున్నారు. టెండర్ ప్రక్రియలో భాగంగా నవనిర్మాణ్ అసోసియేట్స్, మేఘా ఫ్యాబ్రికేట్స్ రెండు ఏజెన్సీలు అర్హత సాధించాయి. రూ. 28.23 లక్షలు కోడ్ చేసిన నవ నిర్మాణ్ అసోసియేట్స్‌కు ఈ నిర్మాణ బాధ్యతలు అప్పగించనున్నారు. ఈ క్రమంలోనే నేడు మేయర్ అధ్యక్షతన జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఈ టెండర్ ప్రక్రియకు ఆమోదం తెలుపనున్నారు.

## కమీషన్ల కోసమే..

### నాసిరకంగా విద్యుత్ మరమ్మతు పనులు

నిత్యం విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాంట్రాక్టర్లు చేసే పనులపై పర్యవేక్షణ చేయని ఉన్నతాధికారులు

సరిపడా విద్యుత్ ఉన్నా ప్రతి రోజూ కరెంటు కష్టాలే..

సిటీబ్యూరో, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్‌లో అత్యంత కీలకమైన ప్రాంతాల్లో అమీర్‌పేట్ ఎల్లారెడ్డిగూడ ఒకటి. అలాంటి ప్రాంతంలో తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. దీనిపై ఓ విద్యుత్ వినియోగదారుడు ఏడీఈకి ఫోన్‌చేసి ప్రతి రోజూ మా దగ్గర కరెంటు పోతున్నదని చెబితే.. ఇన్వర్టర్ పెట్టుకోండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. ఇదే విషయమై అమీర్‌పేట సెక్షన్ పరిధిలో ఆపరేటర్‌కు ఫోన్ చేస్తే.. విద్యుత్ లైన్ పనులను కాంట్రాక్టర్ సరిగా చేయకపోవడం వల్లే తరచూ సరఫరాకు అంతరాయం కలుగుతోందని చెప్పారు. కేవలం విద్యుత్ నెట్‌వర్క్ నిర్వహణ లోపం వల్లే ఈ సమస్య ఉత్పన్నమవుతుందని తెలిసినా ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అమీర్‌పేట, ఎల్లారెడ్డిగూడ కాకుండా.. గ్రేటర్ పరిధిలోని 10 సర్కిళ్ల పరిధిలో ఇలాంటి అంతరాయాలు విద్యుత్ వినియోగదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. విద్యుత్ సంస్థ తరపున నిర్వహణ, మరమ్మతుల పనులు చేసే కాంట్రాక్టర్లతో ఏఈ, ఏడీఈ, డీఈ స్థాయి అధికారులు కుమ్మక్కై పర్యవేక్షణ చేయడం లేదనే ఆరోపణలున్నాయి. కాంట్రాక్టర్లు ఇచ్చే కమీషన్లు తీసుకొని విద్యుత్ నెట్‌వర్క్ పనులను సరిగా పర్యవేక్షించకపోవడం వల్లే ఈ సమస్య పునరావృతమవుతూనే ఉంది.

#### డిమాండ్‌కు సరిపడా విద్యుత్..

రాష్ట్రంలో విద్యుత్‌కు లోటు లేదు. ఎంత డిమాండ్ ఉన్నా విద్యుత్‌ను సరఫరా చేసేందుకు నెట్‌వర్క్ సైతం అందుబాటులో ఉంది. అయినా తరచూ విద్యుత్ అంతరాయం జరుగుతూనే ఉన్నది. ఒక వైపు ప్రభుత్వం ఒక్క నిమిషం కూడా కరెంటు పోకుండా సరఫరా చేస్తున్నామని చెబుతుంటే, వినియోగదారులు మాత్రం మా ప్రాంతంలో విద్యుత్ అంతరాయాలు ఉన్నాయని ఫిర్యాదు చేస్తున్నారు. తరచూ తలెత్తుతున్న విద్యుత్ అంతరాయాలకు మరమ్మతుల్లో నాణ్యతా లోపమే ప్రధాన కారణమని నిపుణులు పేర్కొంటున్నారు. విద్యుత్ సంస్థ తరపున క్షేత్ర స్థాయిలో విద్యుత్ నెట్‌వర్క్‌లో ఉండే 11 కేవీ ఫీడర్ లైన్స్, ఎల్‌టీ లైన్స్, ట్రాన్స్‌ఫార్మర్స్, ఏబీ స్విచ్‌లు, కండక్టర్ కేబుల్స్ ఏర్పాటు వంటి పనులను కాంట్రాక్టర్లు చేస్తున్నారు. కాంట్రాక్టర్లు చేసే పనులు నాసికరంగా ఉండటం వల్లే తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోందని ఆపరేషన్స్ విభాగంలో పనిచేసే ఫ్యూజ్ ఆఫ్ కాల్ (ఎఫ్‌ఓసీ) సిబ్బంది పేర్కొంటున్నారు.

#### వారి మాట వినే కాంట్రాక్టర్లకే..

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్‌పీడీసీఎల్) పరిధిలో విద్యుత్ నెట్‌వర్క్ పనులు చేసేందుకు సంస్థలో నమోదైన ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్లనే ఎంపిక చేసి పనులు అప్పగించాలి. కానీ, ఇక్కడే ఉన్నతాధికారులైన ఎస్ఈ, డీఈలు, ఏడీఈలు తమకు అనుకూలంగా ఉన్న కాంట్రాక్టర్లను ఎంపిక చేసి పనులు అప్పగిస్తారన్న ఆరోపణలు ఉన్నాయి. విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ కీలకం కావడంతో వారు చెప్పినట్లు వినే కాంట్రాక్టర్లకే పనులు అప్పగిస్తూ అవినీతికి పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల నగర శివారులోని కీసర డివిజన్ పరిధిలో రూ.15 లక్షలతో చేపట్టే పనులకు 28 శాతం తక్కువ మొత్తంతోనే టెండర్ వేసిన ఎల్-1 కాంట్రాక్టర్‌కు పనులను అప్పగించకుండా, 20 రోజుల పాటు పెండింగ్‌లో పెట్టి టెండర్ రద్దు చేశారు. తాము అనుకున్న కాంట్రాక్టరుకు టెండర్ రాకపోవడంతో డీఈ స్థాయి అధికారులు ఆ కాంట్రాక్టునే రద్దు చేసిన ఘటనలు ఉన్నాయి. ఇలా క్షేత్ర స్థాయిలో విద్యుత్ కాంట్రాక్టర్లు చేయాల్సిన పనులు నాసిరకంగా ఉండటం వల్లే తరచూ విద్యుత్ అంతరాయాలకు దారి తీస్తున్నాయని ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా నిరంతరం సరఫరా చేసేందుకు విద్యుత్ శాఖ యంత్రాంగం నెట్‌వర్క్ పనులను సమర్థవంతంగా చేసేలా చూడాల్సిన బాధ్యత ఆపరేషన్స్ విభాగం ఉన్నతాధికారులపై ఉంది.





## జలమండలి ఈడీగా మయాంక్ మిట్టల్

సిటీబ్యూరో, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ ): జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా మయాంక్ మిట్టల్ బాధ్యతలు స్వీకరించారు. నారాయణపేట జిల్లా అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం రెండు రోజుల క్రితం జలమండలి ఈడీగా నియమించింది. ఈ మేరకు బుధవారం ఆయన ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు ఎండీ అశోక్‌రెడ్డిని ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. జలమండలి ఉన్నతాధికారులు, ఉద్యోగులు నూతన ఈడీకి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.



## ఫుడ్ కోర్టుల్లో తనిఖీలు చేపట్టండి

టెలీకాన్ఫరెన్స్‌లో కమిషనర్ ఆమ్రపాలి

సిటీబ్యూరో, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): ఆహార పదార్థాల నాణ్యతపై తనిఖీలు నిర్వహించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం అదనపు, జోనల్ కమిషనర్లతో కమిషనర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆహార పదార్థాలు తయారీ చేస్తున్న కేంద్రాలను తనిఖీ చేయాలని, నాణ్యతా ప్రమాణాలను పరిశీలించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులు, ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే ఫుడ్ సెంటర్లు, హాస్టల్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో దోమల నివారణపై యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టాలని, చుట్టూ ఫాగింగ్ చేయాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణ తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.



ఫిల్మ్‌నగర్‌లోని అంబేద్కర్ నగర్ రోడ్డుపై వేసిన చెత్త.. డంపింగ్ యార్డును తలపిస్తున్నది. దుర్గంధంతో స్థానికులు, అటుగా వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి చెత్త తొలగింపునకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## హాస్టళ్లు, క్యాంటీన్లపై స్పెషల్ డ్రైవ్

జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఆదేశాలు

సిటీబ్యూరో, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ)/మల్కాజిగిరి : జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఆదేశాల మేరకు ఫుడ్ సేఫ్టీ అధికారులు గ్రేటర్ వ్యాప్తంగా ఉన్న హాస్టల్స్ క్యాంటీన్లలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో 12 రెసిడెన్షియల్ విద్యాలయాలు, హాస్టళ్లను తనిఖీ చేశారు. ఎల్బీనగర్‌లో ఒకటి, చార్మినార్‌లో 4, ఖైరతాబాద్‌లో ఒకటి, శేరిలింగంపల్లిలో రెండు, కూకట్‌పల్లిలో ఒకటి, సికింద్రాబాద్ జోన్లలో మూడింటిని తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా వంటగది, వంట సామగ్రి, వాటర్ ట్యాంక్స్, స్టోరేజ్ ఏరియా, తయారు చేసిన ఫుడ్ ఐటమ్స్, రా మెటీరియల్, పారిశుధ్య నిర్వహణ తదితర వాటిని ఫుడ్ సేఫ్టీ అధికారుల అధికారులు పరిశీలించారు. నిబంధనలు పాటించని వాటికి షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్లు అధికారులు హెచ్చరించారు. ఈ తనిఖీలు 15 రోజుల పాటు నిర్వహించనున్నారు. బుధవారం మల్కాజిగిరిలోని బ్రౌన్ బేర్ బేకరీలో కుళ్లిపోయిన బర్గర్ అమ్మారని వినియోగదారుడు ఆరోపించారు. ఈ విషయం పై అతడు సర్కిల్ అధికారులతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన అధికారులు బేకరీకి వచ్చి పరిశీలించారు. పాడైన బర్గర్‌ను చూసి ధృవీకరించారు. బేకరీలో తనిఖీలు చేసి అనుమానం ఉన్న ఆహార పదార్థాలను పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపిస్తామని తెలిపారు.



ఓ హోటల్‌లోని స్టోరేజ్ రూమ్‌లో తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు